క్లుప్తంగా

పరిగిలో చోరీ



బీరువా తలుపులు తెరిచిన దృశ్యం

పరిగి: మండల కేంద్రంలో కాలువపల్లి విమల్ కుమార్ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. విమల్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శుభ కార్యం నిమిత్తం గత గురువారం చిత్తూరు జిల్లాకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయం తెలుసుకున్న దుండగులు శుక్రవారం రాత్రి ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలో భద్రపరచిన మూడున్నర తులాల బంగారు ఆభరణాలతో పాటు కిలో వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి వచ్చిన విమల్‌కుమార్ కుటుంబ సభ్యులు.. చోరీ జరిగిన విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం

మడకశిరరూరల్: పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. శనివారం సాయంత్రం బుళ్లసముద్రం గ్రామంలోని సూర్య విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో సర్పంచ్ రంగమ్మ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) నిర్వహించారు. ముఖ్య అతిథి ఎస్పీ రత్న మాట్లాడుతూ చదువు, సామాజిక చైతన్యంతోనే పరిస్థితుల్లో మార్పు వస్తుందని తెలిపారు. జిల్లాలో అక్కడక్కడ రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతుండడం, ఇటువంటి వాటికి స్వస్తి పలకాలన్నారు. ప్రాథమిక హక్కుల్లో స్వేచ్ఛ, సమానత్వం ముఖ్యమైనవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరుణాకర్, సీడీపీఓ నాగమల్లేశ్వరి, సీఐలు నగేష్‌బాబు, రాజ్‌కుమార్, ఎస్‌బీ.ఎస్ఐ మునిప్రతాప్, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సోలార్ సద్వినియోగం చేసుకోండి

హిందూపురం: సబ్సిడీపై అందిస్తున్న సోలార్ విద్యుత్ ఉత్పత్తి పరికరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం హిందూపురం డివిజన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అవసరమైన చోట్ల కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాట్లు చేస్తామన్నారు. సోలార్ యూనిట్ల గురించి వివరించారు.

భూబకాసురుడు



ఈయన పేరు అశ్వత్థప్ప. చిలమత్తూరు మండలం మొరసలపల్లి గ్రామం. రెడ్డెప్పశెట్టికి ఎకరా రూ.6.50 లక్షల చొప్పున రెండెకరాలను మూడేళ్ల కిందట విక్రయించాడు. ఇప్పటికీ రెడ్డెప్పశెట్టి రూ.3 లక్షలకు పైగా బాకీ ఉన్నాడు. ఇతని సోదరులు ఇద్దరు కూడా 2 ఎకరాల చొప్పున విక్రయించారు. వీరిలో ఒకరికి రూ.10 లక్షలు ఇవ్వాల్సి ఉంది. డబ్బు అడిగితే ఉన్న భూమి కూడా తనకు విక్రయించాలని.. లేకుంటే ఆ డబ్బు ఇచ్చేది లేదని వేధిస్తున్నాడు. చౌడిరెడ్డి అనే వ్యక్తి మధ్యవర్తిగా ఉండి రైతులను మోసం చేసే డ్రామాకు తెరతీశారు. మొరసలపల్లికి చెందిన మరో రైతు వద్ద భూమి కొనుగోలు చేసిన రెడ్డెప్పశెట్టి రూ.5 లక్షలు బకాయి పెట్టి తిప్పుకుంటున్నట్టుగా తెలుస్తోంది.

ఆగని రియల్టర్ రెడ్డప్పశెట్టి భూదాహం

- సీలింగ్, అసైన్‌మెంట్ భూములూ కొనుగోలు
- అరకొర చెల్లింపులతో అమాయకులకు మోసం
- ఎస్సీల భూములకూ కంచె వేసేస్తున్నాడు



చిలమత్తూరు: రియల్టర్ రెడ్డెప్పశెట్టి నదులు, ప్రభుత్వ భూములు, లేపాక్షి నాలెడ్జి హబ్ భూములే కాదు ఆఖరికి పేదల భూములనూ వదలడం లేదు. పట్టా అయితే రిజిస్ట్రేషన్, అసైన్‌మెంట్ అయితే లీజు/ అగ్రిమెంట్ చేసుకోవడం.. అరకొర చెల్లింపులు చేసి.. భూమంతటికీ కంచె వేసి తన ఆక్రమణల సామ్రాజ్యంలో కలిపేసుకుంటున్నాడు. అధికార యంత్రాంగం అండతో రియల్టర్ మరింత రెచ్చిపోతున్నాడని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రియల్టర్ చెరలో ఎస్సీల భూములు..

ప్రభుత్వం అణగారిన వర్గాలైన ఎస్సీలకు గతంలో సీలింగ్ భూములకు పట్టాలిచ్చింది. అయితే ఆ భూములు ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారి రెడ్డెప్పశెట్టి కోరల్లో చిక్కుకున్నాయి. అరకొర డబ్బు ముట్టజెప్పి.. వారితో పత్రాలు రాయించుకొని తన అధీనంలో ఉంచుకున్నాడు. మొరసలపల్లి పంచాయతీలో సర్వే నంబరు 147కు సంబంధించిన భూమి ఆయన అధీనంలో ఉండటమే ఇందుకు నిదర్శనం. అసైన్‌మెంట్ భూములకు సంబంధించి ఎటువంటి క్రయవిక్రయాలకూ అవకాశం ఉండేది కాదు. గతంలో ఫ్రీహోల్డ్ వ్యవహారమే లేని సమయంలో భూములను అనధికారికంగా, చట్టాలను ఉల్లంఘించి భూములను సొంతం చేసుకున్నాడు. అయితే ఇప్పటికీ ఆ భూములు రైతుల పేరిటే ఉన్నాయి. తిరిగి తమ భూములు దక్కించుకునేందుకు రైతులు పడుతున్న తాపత్రయం అంతా ఇంతా కాదు. ప్రభుత్వ పెద్దల అండ, జిల్లాస్థాయి అధికారుల అండ రెడ్డప్పశెట్టికి ఉండటంతో రైతులు తమ భూములను చేజిక్కించుకోలేకపోతున్నారు. గట్టిగా ప్రశ్నిస్తే మాత్రం రైతులతో రాయించుకున్న పత్రాలు చూపి కోర్టులో వేస్తానని బెదిరింపులకు దిగుతున్నాడు. రూ.లక్షలు విలువ చేసే భూములను కనీస నామమాత్రపు ధర కూడా చెల్లించకుండా, తర్వాత ఇస్తానని తిప్పుకుంటూ చివరకు ఇవ్వకుండానే ఆ భూములను తన అధీనంలో ఉంచుకుంటున్నాడని బాధితులు వాపోతున్నారు.

అక్రమార్కునిపై చర్యలకు వెనుకంజ..

రైతులను వేధించడం, బెదిరించి భూములు లాక్కోవడం, నదిపై బ్రిడ్జి నిర్మాణం, రూ.కోట్ల రూపాయల సబ్సిడీలు కొల్లగొట్టడం, విద్యుత్ చౌర్యం.. ఇలా ఐదు శాఖల పరిధిలో అవినీతి అక్రమాలకు పాల్పడిన రెడ్డప్పశెట్టిపై చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనకంజ వేస్తున్నారు. తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా ఐదు శాఖల అధికారుల్లో ఒక్క ఇరిగేషన్ మినహా మరే శాఖ కూడా రెడ్డెప్పశెట్టి వ్యవహారంలో పోరాడింది లేదు. గుట్టుగా విచారణలు జరిపి జిల్లా కార్యాలయాల్లోనే అంతా 'సెట్' చేసేస్తున్నారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ మారుతి.. రెడ్డెప్పశెట్టి ఆక్రమణలపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ప్రకారం ఒక వ్యక్తికి ఉండాల్సిన భూమి కంటే ఎక్కువ భూమి ఉండటాన్ని అధికారులు గుర్తించారు. అయినా ఎవిక్షన్ నోటీసులు కేవలం గోడలకే పరిమితం కావడం అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

4న వెన్నుపోటు దినం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, నాయకులు

- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
- విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు

పుట్టపర్తి టౌన్: ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల నాలుగో తేదీన పుట్టపర్తిలో 'వెన్నుపోటు దినం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులతో కలసి 'వెన్నుపోటు దినం' పోస్టర్లు విడుదల చేశారు. దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనం, ఇంటికో ఉద్యోగం/ నిరుద్యోగ భృతి, అన్నదాతా సుఖీభవ తదితర పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోతే చొక్కా పట్టుకోవచ్చని నారా లోకేష్ ఎన్నికల సమయంలో అన్నారని, మరి ఇప్పుడు దీనిపై ప్రజలకు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కుటమి ప్రభుత్వంపై సమర సంఖారావం పూరించే సమయం ఆసన్నమైందన్నారు. నాలుగో తేదీ ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధసంఘాల సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రాణం తీసిన ఓవర్‌టేక్





మృతుడు జాన్‌రెడ్డి (ఫైల్), ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్ వెంకటరమణ, చెన్నమ్మ

- కారును ఢీకొన్న కేఎస్ఆర్టీసీ బస్సు
- ఒకరు మృతి.. నలుగురికి గాయాలు

ఉరవకొండ/ ఉరవకొండ రూరల్: ఓవర్ టేక్ ఒకరి ప్రాణాన్ని బలిగొంది. కారును కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరానికి చెందిన ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ జాన్‌రెడ్డి (80), చెన్నమ్మ దంపతులు తమ కుమార్తె షైనీదీప్తి, అల్లుడు రోహన్‌రెడ్డితో కలిసి కర్ణాటకలోని హంపి క్షేత్రాన్ని సందర్శించి శనివారం కారులో తిరుగు పయనమయ్యారు. బూదగవి సమీపంలో బళ్లారి నుంచి ఉరవకొండకు వస్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు ఓవర్‌టేక్ చేసే క్రమంలో కారును వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న జాన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య, కూతురు, అల్లుడుతో పాటు కారు డ్రైవర్ వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు.

రిటైర్డు రైల్వే ఉద్యోగి మృతి

కదిరి టౌన్: రోడ్డు ప్రమాదంలో విశ్రాంత రైల్వే ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... కదిరి మండలం మాచిరెడ్డిపల్లికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి జరిపిటి లక్ష్మన్న (68) తన పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి శనివారం ద్విచక్రవాహనంపై కదిరికి బయల్దేరాడు. అనంతపురం రోడ్డు పీవీఆర్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన లక్ష్మన్నను స్థానికులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే లక్ష్మన్న మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుమారుడు ధనుంజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

గాండ్లపెంట: కటారుపల్లి క్రాస్‌లోని ప్రాథమిక పాఠశాల మలుపు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ముదిగుబ్బకు చెందిన ప్రసాద్ (38) భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి ఇటీవల అత్తగారి ఊరైన కటారుపల్లి పంచాయతీ జురుకువారిపల్లికి వచ్చాడు. శనివారం గాండ్లపెంట నుంచి కటారుపల్లి వైపు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా కదిరి నుంచి వస్తున్న టిప్పర్ ప్రాథమిక పాఠశాల మలుపులో ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

కదిరి టౌన్: అరుగుమీద నుంచి పడి గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో మృతి చెందాడు. మున్సిపల్ పరిధిలోని టంగుటూరి వీధిలో నివాసముంటున్న సయ్యద్ నౌషాద్ బాషా (38) మే 27న ఇంటి ముందర అరుగుపై పడుకుని ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు అనంతపురం ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి నౌషాద్‌బాషా మృతి చెందాడు. అన్న సయ్యద్ ఆజాద్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

జెడ్పీలో బదిలీల జాతర



కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ పరిధిలోని ఉద్యోగులకు అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో శనివారం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ క్యాంపస్ ఉద్యోగులు, వారి వెంట వచ్చిన వారితో జాతరను తలపించింది. సీఈఓ వెంకటసుబ్బయ్యతో కలసి ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 264 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకోగా, 90 మందికి స్థానచలనం కల్పించారు. ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు 152 మంది కాగా వారిలో 42 మందిని బదిలీ చేశారు. రిక్వెస్ట్ కింద 113 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకోగా.. 48 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు.

యూనియన్ లీడర్ల హల్‌చల్

కౌన్సెలింగ్ జరిగిన సమావేశ భవన్‌లో వివిధ యూనియన్ల నాయకులుగా చెలామణి అవుతున్న హల్‌చల్ చేశారు. తమ యూనియన్ సభ్యత్వం కలిగిన వారికి తామే దగ్గరుండి కోరుకున్న చోటుకు బదిలీ చేయిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారు. డబ్బులు దండుకునేందుకు ఇలా నాటకాలకు తెర తీశారని విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, పది, పదిహేనేళ్లుగా ఒకేచోట పాతుకుపోయిన వారిని మళ్లీ పాత స్థానాల్లోనే కొనసాగించడం దారుణమంటూ పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక.. గతంలో జెడ్పీలో పని చేసి అనేక ఆరోపణలు, విమర్శలు మూటగట్టుకున్న వారు ఎనిమిది నెలల కిందట ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. అటువంటి వారు పలుకుబడిని ఉపయోగించి తాజాగా మళ్లీ జెడ్పీకి చేరుకోవాలని ఆశించి అన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఎత్తులు పారలేదు.

నలుగురు ఎంపీడీఓలకూ రిక్వెస్ట్ బదిలీలు..

తనకల్లు ఎంపీడీఓ ఐ.మమతాదేవిని నార్పలకు బదిలీ చేశారు. ముదిగుబ్బ ఎంపీడీఓ బి.విజయభాస్కర్‌ను బొమ్మనహాళ్‌కు, కె.ఆజాద్‌ను రామగిరి నుంచి తనకల్లుకు, నార్పల ఎంపీడీఓ ఎస్.గంగావతిని రామగిరికి బదిలీ చేశారు.

క్యాడర్ల వారీగా బదిలీలు ఇలా..

క్యాడర్	ఐదేళ్లు పూర్తయిన వారు	బదిలీలు	రిక్వెస్ట్	బదిలీలు
ఎంపీడీఓ	-	-	8	4
ఏఓలు	0	0	13	6
ఎస్ఏలు	10	4	16	3
జేఏలు	6	2	32	15
టైపిస్టులు	3	0	9	3
ఆర్ఏలు	46	12	16	3
ల్యాబ్ అసిస్టెంట్లు	12	9	5	3
లైబ్రరీ అసిస్టెంట్లు	1	1	0	0
అటెండర్లు	74	14	14	11
మొత్తం	152	42	113	48

స్టేషన్ పాయింట్ల నమోదులో ఇష్టారాజ్యం

- ఎక్కువ పాయింట్లు నమోదు చేసుకున్న 84 మంది ఎస్జీటీలు
- అధికారుల పరిశీలనలో వెలుగులోకి..



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా స్టేషన్ పాయింట్లు (పని చేస్తున్న స్కూల్) గరిష్టంగా 24కు మించి ఉండకూడదు. ఎనిమిదేళ్ల సర్వీసుకు (3వ కేటగిరీ) 24 పాయింట్లు వస్తాయి. ఆపైన 9–10 ఏళ్ల సీనియారిటీ ఉన్నా..గరిష్టంగా ఎనిమిదేళ్లకే పాయింట్లు పరిగణనలోకి తీసుకోవాలంటూ ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులిచ్చింది. అయినా కొందరు టీచర్లు ఇష్టానుసారంగా నమోదు చేసుకున్నారు. సరి చేయాల్సిన మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఫలితంగా వందలాది మంది టీచర్లు ఇష్టానుసారంగా స్టేషన్ పాయింట్లు నమోదు చేసుకున్నారు. ఎస్జీటీ తెలుగులో 3,872 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకోగా... వీరిలో 84 మంది ఎస్జీటీలు స్టేషన్ పాయింట్లు 24కు పైగా వేసుకున్నారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి ఎడిట్ చేయాలని డీఎస్ఈ నుంచి డీఈఓలు, ఎంఈఓలకు ఆదేశాలు వచ్చాయి.

పట్టించుకోని ఎంఈఓలు..

ఎంఈఓల లాగిన్లకు వచ్చిన దరఖాస్తులను..సంబంధిత టీచర్లతో హార్డ్‌కాపీలు తెప్పించుకుని వారు వేసుకున్న పాయింట్లను పరిశీలించి ఆమోదం తెలపాలి. చాలా మండలాల్లో ఎంఈఓలు పట్టించుకోని కారణంగా ఈ ప్రక్రియ సరిగా జరగలేదు. కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు కంప్యూటర్ల ముందు కూర్చుని వచ్చిన దరఖాస్తులను వచ్చినట్లుగానే నిర్ధారించారు. తర్వాత డీఈఓ లాగిన్‌కు వచ్చిన దరఖాస్తులను కూడా కార్యాలయ సిబ్బంది అలానే నిర్ధారించి పంపారు. ఫలితంగానే వందలాది మంది టీచర్లకు స్టేషన్ పాయింట్లలో తేడా వచ్చింది. వీటిని సరిదిద్దుతున్నామని డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు.

'ప్రత్యేక' పాయింట్లలోనూ అడ్డదారులు..

కొందరు టీచర్లు అనుకూలమైన స్థానాలకు వచ్చేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. పుట్టుకతో వచ్చిన శారీరక వైకల్యాలు, వ్యాధుల బారిన పడిన వారు ప్రిఫరెన్షియల్ కేటగిరీలో ఉన్నా, ప్రత్యేక పాయింట్లు పొందినా ఎవరికీ అభ్యంతరం ఉండదు. అయితే..లేని రోగాలను సృష్టించుకుని అడ్డదారుల్లో నకిలీ సర్టిఫికెట్లు పొంది పాయింట్లు పొందుతుండడాన్ని చాలామంది వ్యతిరేకిస్తున్నారు. డి.హీరేహాళ్ మండలంలో పని చేస్తున్న ఓ ఎస్జీటీ ఇటీవల బైకుపై నుంచి కిందకు పడ్డాడు. ఇదే అదనుగా తనకు మేజర్ సర్జరీ జరిగినట్లు ప్రచారం చేసుకుని నకిలీ సర్టిఫికెట్ తెచ్చుకుని.. ప్రత్యేక పాయింట్లు పొందాలని చూస్తున్నాడు. ఈయన వ్యవహారంపై కొందరు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇలాంటి వారు పదుల సంఖ్యలో ఉన్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి..

బదిలీలు, ప్రమోషన్ల కోసం తీసుకున్న మెడికల్ సర్టిఫికెట్లను పున:పరిశీలించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ ఎవరైనా మెడికల్ సర్టిఫికెట్లను దుర్వినియోగపరిస్తే.. వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్తంభానికి కట్టేసి.. చితకబాది..



బాబాను స్తంభానికి కట్టేసిన దృశ్యం

కదిరి టౌన్: పెట్రోల్ బంకు వర్కర్‌ను స్తంభానికి కట్టేసి.. చితకబాదిన అమానుష ఘటన కదిరిలో వెలుగు చూసింది. కుమ్మరవాండ్లపల్లిలో హరికృష్ణ అనే వ్యక్తి పెట్రోలుబంకు నిర్వహిస్తున్నాడు. ఇక్కడ బాబా అనే వ్యక్తి వర్కర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం విధులు ముగించుకుని.. పెట్రోలు అమ్మగా వచ్చిన మొత్తాన్ని మేనేజర్ సూర్యనారాయణకు అందజేశాడు. అయితే అందులో రూ.24వేలు తక్కువగా వచ్చిందని, ఆ మొత్తాన్ని అతనే కాజేసి ఉంటాడని మేనేజర్ సూర్యనారాయణ, అమర అనే మరో వర్కర్‌తో కలిసి బాబాను దుస్తులు తొలగించి, స్తంభానికి కట్టేసి చితకబాదారు. అనంతరం బాధితుడు తాను డబ్బు సక్రమంగా జమచేసినా.. అకారణంగా దొంగను చేసి కొట్టారంటూ మేనేజర్, మరొక వర్కర్‌పై కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ నిరంజన్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

ద్విచక్రవాహనాల ఢీ

- ముగ్గురికి గాయాలు



బాడుగ వాహనంలో ఆస్పత్రికి వచ్చిన క్షతగాత్రులు

మడకశిర రూరల్: యు.రంగాపురం వద్ద శనివారం ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు... జీవీపాళ్యం పంచాయతీ బంద్రేపల్లి నుంచి శివన్న లక్ష్మీదేవి అనే మహిళతో కలిసి ద్విచక్రవాహనంలో మడకశిరకు బయల్దేరాడు. ఇదే సమయంలో యూ రంగాపురం చెందిన ఖాసీమ్ పని నిమిత్తం బైక్‌పై వెళ్తున్నాడు. సరిగ్గా రోడ్డు క్రాస్‌లోకి రాగానే రెండు ద్విచక్రవాహనాలు వేగం అదుపు చేసుకోలేక ఢీకొన్నాయి. శివన్న, ఖాసీమ్‌లకు తీవ్ర గాయాలు కాగా.. లక్ష్మీదేవి స్వల్పంగా గాయపడింది. స్థానికులు గమనించి 108కు ఫోన్ చేస్తే ఎంతసేపటికీ అంబులెన్స్ చేరుకోలేదు. ఆలస్యమవుతుండడంతో బాడుగకు వాహనం మాట్లాడుకుని కుటుంబ సభ్యులు మడకశిర ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం శివన్న, ఖాసీమ్‌ను మెరుగైన వైద్యం కోసం హిందూపురం పంపించారు.

వివాహిత బలవన్మరణం

- అదనపు కట్నం వేధింపులే కారణం



మృతి చెందిన భాగ్యలక్ష్మి

ధర్మవరం అర్బన్: అదనపు కట్నం కోసం అత్తింటివారు పెడుతున్న వేధింపులు భరించలేక వివాహిత తన పుట్టింటిలో బలవన్మరణానికి పాల్పడింది. ధర్మవరం టూటౌన్ సీఐ రెడ్డప్ప వివరాల మేరకు... కడప జిల్లా వేంపల్లి మండలానికి చెందిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ చిన్న నరసింహులుకు ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి(31)తో పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. పెళ్లయిన కొంత కాలం తర్వాత నుంచి అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్తమామలు సుబ్బమ్మ, పెద్ద నరసింహులు వేధించడం మొదలు పెట్టారు. పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు కూడా చేశారు. అయినా మెట్టినింటి వారి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో భాగ్యలక్ష్మి 20 రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. మనోవేదనకు గురైన భాగ్యలక్ష్మి శనివారం ఇంట్లోనే ఉరివేసుకుంది. మృతురాలి తల్లి కొండమ్మ ఫిర్యాదు మేరకు మెట్టినింటి వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఓడీచెరువు: పగడాలవారిపల్లికి చెందిన కొక్కంటి శంకరప్ప (54) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మే 29న శంకరప్ప గానిపల్లిలో మద్యం తాగి పడిపోయాడు. విషయం తెలుసుకున్న కుమారుడు అతడిని ఇంటికి తీసుకొచ్చాడు. మరుసటి రోజు తెల్లవారుజామున ఐదున్నర గంటలకే శంకరప్ప ఇంటి నుంచి వెళ్లిపోయాడు. శనివారం ఊరి చివరన ఓ చెట్టుకు ఉరికి వేలాడుతూ ఉండగా కుటుంబ సభ్యులు గుర్తించారు. కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెళ్లి పేరుతో వంచన

- నిందితుడికి రిమాండ్

కదిరి టౌన్: పెళ్లి పేరుతో వంచన చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. ఎన్పీకుంట మండలం గంగిరెడ్డుల్లోళ్లపల్లికి చెందిన హరిప్రసాద్‌రెడ్డి కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో ప్రైవేట్ విద్యుత్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇతను గతంలో కదిరి పట్టణంలోని ఎస్టీ సామాజికవర్గానికి చెందిన ఒంటరి మహిళను పెళ్లి చేసుకుంటానని దగ్గరై.. గర్భవతిని చేసిన తర్వాత ప్లేటు ఫిరాయించాడు. దీంతో బాధిత మహిళ పట్టణ పోలీస్ స్టేషన్‌లో నాలుగు రోజుల క్రితం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు హరిప్రసాద్‌ను శనివారం రాయచోటి రోడ్డు వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి సమీపంలో అరెస్టు చేసి కదిరి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. నిందితుడికి మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్‌కు విధించడంతో అతన్ని అనంతపురం సబ్ జైలుకు తరలించినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.



చీనీ టన్ను రూ.32 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32 వేలు, కనిష్టంగా రూ.6 వేల ప్రకారం ధర పలికాయి.



రాష్ట్రంలో దగాకోరు పాలన
రాష్ట్రంలో దగాకోరు పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. మహానాడులో చంద్రబాబు ప్రసంగమే ఇందుకు నిదర్శనమన్నారు. 10లో

గరిష్టం/కనిష్టం
34.4°/ 22.3°
జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత స్వల్పంగా తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

అనుమతుల్లేకుండా క్లినిక్‌లు నడిపితే చర్యలు

- డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం

కదిరి టౌన్: అనుమతుల్లేకుండా క్లినిక్‌లు నడిపితే చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) ఫైరోజాబేగం హెచ్చరించారు. క్లినిక్ సీజ్ చేయడంతో పాటు సదరు డాక్టర్‌పై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం ఆమె కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాలులో కదిరి ఐఎంఏ ప్రతినిధులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయన్నారు. అందువల్ల డాక్టర్లు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలో భ్రూణహత్యల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనధికార అబార్షన్లు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జననాల ధ్రువీకరణ పద్ధతి, మేల్ అండ్ ఫీమేల్ జననాల సంఖ్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోషియేషన్ కదిరి శాఖ సభ్యులు, ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లు డీఎంహెచ్‌ఓను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్, డాక్టర్లు శంకరయ్య, సీవీ మదన్‌కుమార్, విద్యాసాగర్, హుస్సేన్, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, మారుతి ప్రసాద్, ముస్తఫా, విజయ్, తన్వీర్, ప్రమీల, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీలో ఆరుగురికి పదోన్నతి



పదోన్నతి ఉత్తర్వులను అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఆరుగురికి పదోన్నతి కల్పిస్తూ జెడ్పీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఐదుగురు ల్యాబ్ అసిస్టెంట్, ఓ రికార్డు అసిస్టెంట్‌కు జూనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించారు. వీరిలో భీమయ్య (గుమ్మఘట్ట), ఫకృద్దీన్ (సిద్దరాంపురం), లక్ష్మన్న (నాగసముద్రం), సాదిక్ బాషా (తగరకుంట), హరికృష్ణ (ముదిగుబ్బ), వెంకటేశులు (కళ్యాణదుర్గం) ఉన్నారు. వీరికి పదోన్నతుల ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అందజేసి, అభినందించారు. అలాగే జిల్లా పరిషత్ యాజమాన్యం కింద పనిచేసే ఉద్యోగులకు శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు సీఈఓ వెంకట సుబ్బయ్య తెలిపారు. చైర్‌పర్సన్ సమక్షంలో ఉదయం 9:30 గంటలకు కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవుతుందన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో ప్రవాస భారతీయుడిని మోసం చేసిన కేసు మలుపులు తిరుగుతోంది. పుట్టపర్తిలో జరిగిన ఘటన పోలీసుల పుణ్యమా అని ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దొంగలకే దొంగ, కేటుగాళ్లకు కేటుగాడు వంటివన్నీ సినిమాల్లోనే చూస్తుంటాం.. కానీ పుట్టపర్తి పోలీసులు పట్టపగలే తమ కార్యాలయంలోనే ఇలాంటివి చూపించారు.

ఎన్‌ఆర్‌ఐని చీటింగ్ చేసిన కేసులో భారీ ట్విస్టులు

- నిందితుడిని పోలీస్‌స్టేషన్‌లో పెట్టి స్థిరాస్తుల బదలాయింపు
- పోలీసుల ఆధ్వర్యంలోనే నిందితుడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి
- కేసు నమోదు చేసిన వారానికి అరెస్టు చూపించిన పోలీసులు
- పోలీసు అధికారులకు రూ.50 లక్షల డీల్ కుదిర్చిన టీడీపీ నేతలు



కంత్రీ ఖాకీలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రవాస భారతీయుడైన ఆర్వీన్ మహేంద్రకర్‌ను పుట్టపర్తికి చెందిన సత్యనారాయణ రాజు రూ.12.50 కోట్ల మేర మోసం చేశారు. ఈ కేసులో బాధితుడికి పెద్దగా లాభం చేకూరకపోగా నిందితుడి నుంచి పోలీసులకు, తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు అన్నదమ్ములకు, ద్వితీయశ్రేణి నాయకులకు బాగా లబ్ధి కలిగింది.

పోలీసులకు రూ.50 లక్షల డీల్

ఎన్‌ఆర్‌ఐ మోసపోయిన కేసులో పోలీసులకు రూ.50 లక్షల డీల్ కుదిరినట్టు తెలిసింది. ఈ నెల 22న బాధితుడి ఫిర్యాదు మేరకు సత్యనారాయణ రాజుపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినా.. 28వ తేదీ వరకు అరెస్టు చూపించలేదు. ఈ ఏడు రోజుల పాటు నిందితుణ్ని స్టేషన్‌లో హింసించి.. లొంగదీసుకుని దారికి తెచ్చుకున్నారు. టీడీపీకి చెందిన ఇద్దరు అన్నదమ్ములు, ఒక మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించారు. తాము చెప్పినట్టు చేస్తే మీకు రూ.50 లక్షలు ఇస్తామని టీడీపీ నాయకులు పోలీసు అధికారికి చెప్పడంతో తలూపిన సదరు అధికారి బాధితుణ్ని గోప్యంగా ఉంచి.. చేయాల్సిందంతా చేశారు.

ఆస్తుల బదలాయింపు

నిందితుడి పేరిట భారీగా భూములు, స్థలాలు ఉన్నాయి. వీటిని కొట్టేయాలనేదే ఆలోచన. పథకంలో భాగంగా అరెస్టుకు ముందే నిందితుడి పేరున ఉన్న కొన్ని భూములు ఓ మహిళ (ఎన్‌ఆర్‌ఐ భార్య) పేరిట బదలాయించారు. ఈమె పుట్టపర్తిలో పూల వ్యాపారం చేసుకునేది. వీసా సమస్య వస్తుందని గతంలో మహేంద్రకర్‌కు సదరు మహిళతో ప్రస్తుత నిందితుడు సత్యనారాయణరాజు పెళ్లి జరిపించారు. ప్రవాస భారతీయుడైన మహేంద్రకర్‌కు ఇక్కడి విషయాలు తెలియవు. దీంతో ఈమెను టీడీపీ నాయకులు, పోలీసులు భయపెట్టి తమ వైపు తిప్పుకున్నారు. అనంతరం సత్యనారాయణరాజు పేరుపై ఉన్న ఆస్తులు బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో (డాక్యుమెంటు నంబర్లు 1563, 1564, 1584) ఆమె పేరుపై బదలాయించారు. ఏకంగా పోలీసుల సమక్షంలోనే ప్రైవేటు ఎస్కార్టు వాహనాల్లో నిందితుణ్ని తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించారంటే పోలీసులు ఏ స్థాయిలో బరితెగించారో అంచనా వేయొచ్చు. ముందుగా ఆమె పేరుతో బదలాయించి.. ఆ తర్వాత తక్కువ ధరకు టీడీపీ నేతలు రాయించుకోవాలనేది ఎత్తుగడ. నిందితుణ్ని వారం రోజులు అరెస్టు చూపించకుండా చేసిన వ్యవహారం తాజాగా బయటకు వచ్చింది. ఇక్కడ భారీగా లబ్ధిపొందిన పోలీసు అధికారిపై గతంలోనూ పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐతో కలిసి పోలీసు బాస్‌లకు వసూళ్లు చేసి పెట్టడంలోనూ ఈ అధికారికి ప్రమేయమున్నట్టు తెలుస్తోంది. ప్రశాంతి నిలయానికి కూతవేటు దూరంలో జరుగుతున్న ఈ అరాచకాలు సాయి భక్తులకు విస్మయం కలిగిస్తున్నాయి. ఎన్నో దేశాల నుంచి సాయి సన్నిధికి భక్తులు వస్తుంటారు. ఇలా పోలీసులే నిందితుల నుంచి వసూళ్లు మొదలెడితే పరిస్థితి ఏమిటని వాపోతున్నారు. తీవ్ర విమర్శలు రావడంతో పుట్టపర్తి పోలీసులు తమను తాము కాపాడుకునే పరిస్థితికి వచ్చారు.

వైఎస్సార్‌సీపీలో నయా జోష్

- పార్టీ అనుబంధ విభాగాల్లో జిల్లా వాసులకు చోటు



సాక్షి, పుట్టపర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత పటిష్టం చేసేందుకు ఆ పార్టీ అధిష్టానం చర్యలు చేపట్టింది. పార్టీ అనుబంధ విభాగాల్లో పలువురు యువకులకు చోటు కల్పిస్తోంది. ఈ క్రమంలోనే పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురికి చోటు లభించింది. ఈ మేరకు తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా జీవీ లింగారెడ్డి (రాప్తాడు), యువజన విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పి.చంద్రశేఖర్‌రెడ్డి (హిందూపురం), బీసీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీలుగా బిల్లే మంజునాథ (రాప్తాడు), ఎం.రాజునాయుడు (పుట్టపర్తి), బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీలుగా పి.వెంకటరమణ (పుట్టపర్తి), కుండ్ల కిష్ట (పుట్టపర్తి), వలంటీర్ విభాగం రాష్ట్ర సెక్రటరీగా మిద్ది భాస్కర్‌రెడ్డి (పుట్టపర్తి), వలంటీర్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా టీడీ విజయభాస్కర్‌రెడ్డి (పుట్టపర్తి), ఐటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా బత్తల సుధీర్ కుమార్ రెడ్డి (రాప్తాడు), ఐటీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా సుబ్బు రాయల్ (రాప్తాడు), వాణిజ్య విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా కె.నర్సిరెడ్డి (పుట్టపర్తి), వాణిజ్య విభాగం రాష్ట్ర సెక్రటరీగా చెరువు భాస్కర్ రెడ్డి (పుట్టపర్తి), వాణిజ్య విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఇ.సోముశేఖర్ రెడ్డి (పుట్టపర్తి)ని నియమించారు.

ఆర్డీటీపై ఆంక్షలు తొలగించాలి

- ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే పునరుద్ధరించాలి: రఘువీరా



మడకశిర రూరల్: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి దశాబ్దాలుగా కృషి చేస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కి విదేశీ నిధులు రాకుండా కేంద్రం విధించిన ఆంక్షలను వెంటనే తొలగించాలని మాజీ మంత్రి రఘువీరారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విదేశాల నుంచి ఆర్డీటీకి నిధులు అందే విధంగా వెంటనే ఎఫ్ఆర్‌సీఏను పునరుద్ధరించాలన్నారు. ఈ మేరకు భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు లోకేష్, సత్యకుమార్, పయ్యావుల కేశవ్, సవిత, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరిలకు లేఖ పంపినట్లు ఆయన వెల్లడించారు. ఆర్డీటీ సంస్థ గత 50 ఏళ్లుగా కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా నిస్వార్థంతో పేదలకు సేవలు అందించిదన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని లక్షలాది కుటుంబాలకు ఆర్డీటీ సేవలందించిందన్నారు. ఈ సంస్థ ఎక్కువగా విదేశీ నిధులపైనే ఆధారపడుతోందన్నారు. ప్రస్తుతం ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ నిలిపి వేయడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాపై ప్రభావం పడుతుందన్నారు. ఇలాంటి సంస్థ గురించి కేంద్రానికి నివేదించి సేవలను పునరుద్ధరించాల్సిన బాధ్యత జిల్లా ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

రోడ్డుపై వరినాట్లు!

రోడ్డు సమస్య తీర్చాలని మహిళల వినూత్న నిరసన



మల్లినమడుగులో ప్రధాన రోడ్డుపై వరినాట్లు వేస్తున్న మహిళలు

రొళ్ల: చిన్నపాటి వర్షానికే బురదమయమవుతున్న రహదారి.. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పైగా రోడ్డుపై నీరు నిల్వ ఉండిపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఎన్నిసార్లు విన్నవించినా అధికారుల్లో చలనం లేదు. దీంతో మహిళలు రోడ్డుపై వరినాట్లు వేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని హెచ్‌టీ హళ్లి–సీసీ గిరి ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనికి తోడు ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షానికి రహదారి బురదమయంగా మారింది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థలేని కారణంగా వర్షపునీరు ప్రధాన రోడ్డు మధ్యలోనే నిలిచింది. వర్షపు నీరు రోజుల తరబడి రోడ్డుపైనే నిలిచిపోవడంతో దోమలు వ్యాప్తి చెందాయి. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించడంతో పాటు రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని ఆర్అండ్‌బీ అధికారులను వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో శుక్రవారం మల్లినమడుగు పంచాయతీ కేంద్రంలో మహిళలు హెచ్‌టీ హళ్లి–సీసీ గిరి ప్రధాన రహదారి మధ్యలో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపట్టి రోడ్డు మధ్యలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

4న ‘వెన్నుపోటు దినం’



పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, పార్టీ నాయకులు

- పోస్టర్ల ఆవిష్కరించిన ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: ‘సూపర్ సిక్స్’ పథకాల పేరుతో ప్రజలను నట్టేట ముంచిన కూటమి సర్కార్ చర్యలకు నిరసనగా వైఎస్సార్ సీపీ జూన్ 4వ తేదీన ‘వెన్నుపోటు దినం’ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ స్థానిక పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కూటమి సర్కార్ సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి మోసగించిందన్నారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీల అమలుకు అడుగులు వేయలేదన్నారు. ముఖ్యంగా సుఖీభవ, ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ వంటి పథకాలు అమలు చేయకుండా కార్మికులు, రైతులు, మహిళలు..ఇలా అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. ముఖ్యంగా యువతకు ఈ ప్రభుత్వం చేసిన ద్రోహం అంతా ఇంతా కాదన్నారు. అందుకే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కూటమి పార్టీల నేతల మోసాన్ని వివరించేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీన ‘వెన్నుపోటు దినం’ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఉషశ్రీచరణ్ కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు నరసింహులు, సుధాకర్ రెడ్డి, నాయకులు వైశాలి జయశంకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చెన్నకేశవులు, గణప్ప, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లిలో కురుస్తున్న వర్షం

కదిరిలో కుండపోత

- వీధులన్నీ జలమయం.. ఇబ్బందులు పడిన జనం
- ఖాద్రీ ఆలయ ఆవరణలోకి చేరిన మురుగునీరు

కదిరి టౌన్: ‘నైరుతి’ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయం కదిరిలో కుండపోత వర్షం కురిసింది. దీంతో వీధులన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా పట్టణంలో వేమారెడ్డి సర్కిల్, అడపాలవీధి, అమీన్‌నగర్, కంచుకోట, వలీసాబ్ రోడ్డు, చౌక్‌బజారు, దేవాలయం బజారు, మార్కెట్, నిజాంవలీ కాలనీ, అంబేడ్కర్ సర్కిల్, ఇందిరాగాంధీ, జీవీమాను సర్కిల్, రాయలసీమ సర్కిల్‌లోని వీధులన్నీ జలమయమయ్యాయి. బాలికల కళాశాల ఆవరణ ప్రాంతంలో వర్షపు నీరు భారీగా చేరడంతో ఆ ప్రాంతం మడుగును తపిస్తోంది. శుక్రవారం కురిసిన వర్షానికి కాల్వలు పొంగిపొర్లగా...మురుగునీరంతా ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోకి చేరింది. ఆలయ ఆవరణ మొత్తం నీరు చేరడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

12 మండలాల్లో వర్షం..

పుట్టపర్తి అర్బన్: నైరుతి రుతుపవనాలు జిల్లా అంతా విస్తరించడంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ జిల్లాలోని 12 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా ఎన్‌పీ కుంట మండలంలో 33.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక నల్లచెరువు మండలంలో 29.2 మి.మీ, కదిరి 12.8, తలుపుల 12.4, గాండ్లపెంట 10, ఓడీచెరువు 9.2, తనకల్లు 8.2, లేపాక్షి 6.4, పెనుకొండ 5.8, అమడగూరు 2.4, పుట్టపర్తి 1.6, నల్లమాడ మండలంలో 1.2 మి.మీ చొప్పున వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం సైతం పలు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది.



కదిరి: ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ముందు నిలిచిన నీరు



కదిరి: ఇబ్బందులు పడుతున్న భక్తులు

స్వయం ఉపాధి పొందేదెన్నడు?

- బీసీ కార్పొరేషన్ రుణాల కోసం అభ్యర్థుల నిరీక్షణ



బీసీ కార్పొరేషన్ కార్యాలయం

అనంతపురం రూరల్: వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం (బీసీ కార్పొరేషన్) అందించే సబ్సిడీ రుణాల కోసం అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి కానీ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత నుంచి కానీ ఎటువంటి సమాచారమూ అందకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం బీసీల సంక్షేమం, వారి అభ్యున్నతి కోసం ఎంతో చేస్తున్నామని చెబుతున్నా ఆచరణలో అవేమీ కనిపించడం లేదన్న విమర్శలున్నాయి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి పథకంలోనూ బీసీలకు సముచిత న్యాయం జరిగింది. ఆయా సంక్షేమ పథకాల లబ్ధిని ఠంచన్‌గా అందుకున్న సంగతి తెలిసిందే. బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు ఐదు నెలల కిందట నోటిఫికేషన్ వచ్చింది. ఈ మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3,220 యూనిట్లకు 33,129 మంది బీసీ కులాల వారు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో 1,728 యూనిట్లకు గాను 19,098 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 1,492 యూనిట్లకు 14,031 మంది దరఖాస్తు చేసుకోగా.. అధికారులు ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేశారు. ఆ తర్వాత లబ్ధిదారుల ఎంపిక.. రుణాల మంజూరు సమాచారం ఏదీ తెలియడం లేదని అభ్యర్థులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి రుణాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉత్తర్వులు రాగానే రుణాలిస్తాం

బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం నిరుద్యోగ యువత చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలు పూర్తి చేశాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే లబ్ధిదారులకు సమాచారం అందించి రుణాలు అందజేస్తాం. – సుబ్రహ్మణ్యం, ఈడీ, బీసీ కార్పొరేషన్

క్లుప్తంగా

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: అర్హులైన లబ్ధిదారులకు జూన్ నెలకు సంబంధించి పింఛన్లను శనివారం పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 2,66,986 మంది లబ్ధిదారులకు రూ.114.86 కోట్లు మంజూరయ్యాయి. అలాగే అర్హులైన వితంతువులకూ నూతన పెన్షన్లు మంజూరయ్యాయి. 3,030 మంది వితంతువులకు సంబంధించి మరో రూ.1.21 కోట్లు మంజూరయ్యాయి.

ఏరువాక కేంద్రంలో వ్యవసాయ పంచాంగం

పుట్టపర్తి అర్బన్: స్థానిక ఏరువాక కేంద్రంలో 2025-26 సంవత్సరం వ్యవసాయ పంచాంగం పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ రామసుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వరి, మొక్కజొన్న, సజ్జ, కొర్ర, పెసర, కంది, సెనగ, మినుములు, ఉలవ, వేరుశనగ, పొద్దు తిరుగుడు, కుసుమ, ఆవాలు, ఆముదం పంటల సాగు విధానాలు, మందులు పిచికారీ, ఎరువుల వాడకం వంటి వివరాలు క్షుణ్ణంగా ఉన్నాయన్నారు. పుస్తకం కావాల్సిన వారు ఏరువాక కేంద్రంలో రూ.310 చెల్లించి పొందవచ్చునన్నారు. అలాగే పురుగు మందులు, కలుపు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

వివాహిత ఆత్మహత్య

పుట్టపర్తి టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కపట్నం మండలం యాదాలంకపల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌కు కొత్తచెరువు మండలం నారేపల్లి గ్రామానికి చెందిన పార్వతమ్మ (37)తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల కుటుంబంలో కలహాలు చోటు చేసుకోవడంతో మనస్తాపం చెందిన పార్వతి శుక్రవారం క్రిమి సంహారక మందు తాగింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను కుటుంబసభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై మృతురాలి తల్లి తింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు బుక్కపట్నం పీఎస్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

అతిగా నిద్ర మాత్రలు మింగి మహిళ మృతి


మృతురాలు వీణ

ధర్మవరం రూరల్: అతిగా నిద్ర మాత్రలు మింగి ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని నాగులబావికి చెందిన పి.వీణ (48), కమలాకర్ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో కరుణాకర్ మృతి చెందాడు. అప్పటి నుంచి భర్త జ్ఞాపకాలతో వీణ సతమతమవుతూ వస్తోంది. ఈ నేపథ్యంలోనే నిద్రలేమితో బాధపడుతున్న ఆమె వైద్యుల సూచన మేరకు నిద్ర మాత్రలు వాడుతుండేది. ఈ నెల 24న కమలాకర్ వర్ధంతి రోజున భర్తను గుర్తు చేసుకుని చాలా సేపు ఏడుస్తూ ఉండిపోయింది. కుటుంబ సభ్యులు సముదాయించారు. అదే రోజున ఇంట్లో ఎవరికి తెలియకుండా అధిక మోతాదులో నిద్రమాత్రలు మింగిన ఆమె కాసేపటికి అపస్మారక స్థితికి చేరుకుంది. భోజన సమయంలో తమ్ముడు సంతోష్ వెళ్లి నిద్ర లేపేందుకు ప్రయత్నిస్తే ఎలాంటి స్పందన లేకపోవడంతో వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక గురువారం అర్ధరాత్రి ఆమె మృతి చెందింది. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

కొంపముంచుతున్న కొత్త స్నేహాలు



- ఇన్‌స్టాలో చూపులు.. వాట్సాప్‌లో చాటింగ్
- యువతను ముంచుతున్న సోషల్ మీడియా
- సమస్యలతో పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతున్న మైనర్లు



పుట్టపర్తికి చెందిన 17 ఏళ్ల యువతికి గోరంట్ల మండలానికి చెందిన 18 ఏళ్ల యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయయ్యాడు. ఇద్దరూ చాటింగ్ చేసుకుంటూ వాట్సాప్ కాల్స్ వరకు వచ్చారు. ఆ తర్వాత వీడియో కాల్స్.. ఫొటోల మార్పిడి తదితర వ్యవహారాలన్నీ సాగాయి. పెళ్లి చేసుకుందామనేలోపు ఇద్దరి మధ్య తగాదాలు వచ్చాయి. పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ మెట్లెక్కారు. తనకు ఆ అమ్మాయిపై ఇష్టం పోయిందని యువకుడు అడ్డం తిరిగాడు.. మైనర్లు కావడంతో పోలీసులు ఇద్దరికీ సర్దిజెప్పి పంపించారు.

హిందూపురానికి చెందిన 18 ఏళ్ల యువతికి పెనుకొండకు చెందిన 27 ఏళ్ల పురుషుడు ఫేస్‌బుక్ ద్వారా పరిచయమయ్యాడు. తర్వాత ఇద్దరూ ఆర్నెల్ల పాటు చాటింగ్ చేసుకుంటూ ఫోన్ నంబర్లు, అడ్రస్ మార్చుకున్నారు. గంటల తరబడి వాట్సాప్ చాటింగ్ కొనసాగింది. అయితే ఆ తర్వాత ఆ వ్యక్తికి అప్పటికే వివాహమైందన్న విషయం కనుక్కొన్న యువతి నానా రభస చేసింది. తనను మోసం చేశాడంటూ పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు అమ్మాయి తల్లిదండ్రులను పిలిచి గుట్టుగా వ్యవహారాన్ని చక్కబెట్టి పంపారు.

సాక్షి, పుట్టపర్తి: ప్రస్తుతం యువత బయట కంటే సోషల్ మీడియాలోనే ఎక్కువగా అందుబాటులో ఉంటోంది. పలకరింపులు..పరామర్శలన్నీ వాట్సాప్, ఇన్ స్టా గ్రామ్ వేదికగానే సాగుతున్నాయి. ఇదే క్రమంలో సామాజిక మాధ్యమాల ద్వారానే కొత్త కొత్త స్నేహాలు పుట్టుకువస్తున్నాయి. హలో అంటే చాలు పాలోమంటూ ఫ్రెండ్ రిక్వెస్టులు వచ్చి వాలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు తెలిసీ తెలియని వయసులో ఒకరికొకరు ఆకర్షితులై.. తర్వాత లేని పోని సమస్యల్లో ఇరుక్కుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా ఒకరికొకరు దగ్గరై.. ప్రేమ వ్యవహారాల్లో మునిగి తేలుతున్నారు. చాలామంది మైనర్లు సోషల్ మీడియా వేదికగా చిన్న వయసులోనే ప్రేమ, పెళ్లి వ్యవహారాల వరకూ వెళ్తున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలోని ఏదో ఒక పోలీస్ స్టేషన్‌లో వెలుగు చూస్తూనే ఉన్నాయి.

ఎక్కువ మంది మైనర్లే..

తెలిసీ తెలియని వయసులో నిత్యం సోషల్ మీడియాలో ఉంటూ కొత్త పరిచయాలతో స్టేషన్ మెట్లు ఎక్కుతున్న మైనర్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. బాల్య వివాహాలు, ప్రేమ పెళ్లిళ్లు, ఆన్‌లైన్ ప్రేమ తగాదాలు.. ఇలా వివిధ రకాల ఫిర్యాదులు నిత్యం పోలీసు స్టేషన్‌కు వస్తున్నాయి. అయితే ఎక్కువ మంది మైనర్లే ఉండటంతో వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పోలీసులు సామాజిక బాధ్యతగా తల్లిదండ్రులను పిలిపించి.. సర్దిజెప్పుతుండగా... సమస్య బయటికి రాకుండా సద్దుమణుగుతోంది. ఇక ఆన్‌లైన్ ద్వారా పరిచయాలతో పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకున్న జంటలు కూడా నెలల వ్యవధిలోనే విడాకుల వరకూ వచ్చేస్తున్నాయి.

నిబంధనలు బేఖాతరు..

సోషల్ మీడియా పరిచయాలతో దగ్గరవుతున్న వారు...కొన్నిరోజులకే న్యాయం చేయాలంటూ పోలీసు స్టేషన్‌కు వస్తున్నారు. చాలా సందర్భాల్లో అమ్మాయి మైనర్ కావడం... అప్పటికే పరిస్థితి చేయి దాటిన నేపథ్యంలో పెద్దలే గుట్టు చప్పుడు కాకుండా వివాహాలు జరిపిస్తున్నారు. బాల్య వివాహం తప్పని తెలిసినా చాలా మంది ఎదురుచెప్పలేకపోతున్నారు. అధికారులకు తెలిసినా అమ్మాయి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అవగాహన కల్పించడానికే పరిమితం అవుతున్నారు. నూతన జంటలను విడదీయలేక.. మానవీయ కోణంలో ఆలోచించి వదిలేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

మొబైల్ ఫోన్ అతిగా వినియోగించే యువత వాట్సాప్, ఇన్‌స్టాగాం తదితర సోషల్ మీడియా సైట్లలోనే ఎక్కువ సమయం గడుపుతోంది. ఆయా మాధ్యమాల్లో కొత్తవ్యక్తుల పరిచయాలు వారి జీవితాలనే మార్చేస్తున్నాయి. అందువల్ల ఇంట్లో పిల్లలు ఏం చేస్తున్నారనే విషయంపై తల్లిదండ్రులు తప్పనిసరిగా కనిపెడుతూ ఉండాలి. స్మార్ట్ ఫోన్ వినియోగంలో లాభాలతో పాటు అనేక అనర్థాలూ ఉన్నాయి. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై నిత్యం అవగాహన కల్పిస్తున్నాం.

– మహేష్, జిల్లా బాలల సంరక్షణ అధికారి, పుట్టపర్తి

'ఖజానా'లో బదిలీల సందడి


బదిలీల ప్రక్రియపై చర్చిస్తున్న ఉమ్మడి జిల్లా డీడీలు, ఏటీఓలు

అనంతపురం అర్బన్: ఉమ్మడి జిల్లా పరిధిలోని ఖజానా శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై బదిలీల నిర్వహణ కమిటీ సభ్యులు అనంతపురం జిల్లా డీడీ వెంకటేశ్వర్లు, ఏటీఓ రాణి, శ్రీసత్యసాయి జిల్లా డీడీ శ్రీనివాసులు, ఏటీఓ పవిత్ర శుక్రవారం అనంతపురంలోని ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ చాంబర్‌లో సమీక్షించారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో 34 మంది సీనియర్ అకౌంటెంట్లు, 15 మంది జూనియర్ అకౌంటెంట్లు, 12 మంది ఆఫీస్ సబార్డినేట్లు చొప్పున మొత్తం 61 మంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఒకే స్థానంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీనియర్ అకౌంటెంట్లు 19 మంది, జూనియర్ అకౌంటెంట్లు 9 మంది, ఆఫీసు సబార్డినేట్లు 8 మంది ఉన్నారు. అనంతరం డీడీ వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ.. ఖజానా శాఖలో బదిలీలకు సంబంధించి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ అంటూ ఏదీ ఉండదన్నారు. ఖాళీల జాబితా ప్రకటించామని, బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ఆ మేరకు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. వారి దరఖాస్తులను పరిశీలించి నిబంధనల ప్రకారం బదిలీ ప్రక్రియ పూర్తి చేసి స్థానాలను కేటాయిస్తామన్నారు.

రాష్ట్రంలో దగాకోరు పాలన

- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: మహానాడులో చంద్రబాబు ప్రసంగం పరిశీలిస్తే అధికారం నుంచి దిగిపోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయనే బాధ స్పష్టంగా కనిపిస్తోందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఏడాది పాలనలో అన్ని విధాలుగా దగాపడ్డామనే అభిప్రాయానికి రాష్ట్ర ప్రజలు వచ్చారన్నారు. టీడీపీ, జనసేనతో పాటు ఇతర రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడా ఇదే భావనలో ఉన్నారన్నారు. ఈ విషయంపై చంద్రబాబుకు సైతం స్పష్టత వచ్చిందని, అందుకే రానున్న రోజుల్లో అధికారం కోల్పోవాల్సి వస్తుందనే బాధ ఆయన మాటల్లో స్పష్టమైందన్నారు.

చెప్పుకునేందుకు వంద ఉన్నాయి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఇచ్చిన ప్రతి ఒక్క హామీనీ నెరవేర్చారన్నారు. మరో వైపు రాష్ట్రాభివృద్ధిని సైతం పరుగులు పెట్టించారన్నారు. జగన్ పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధిపై చెప్పుకునేందుకు వంద ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ ఏడాది కాలంలో చెప్పుకునేందుకు ఏ ఒక్కటీ లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమల ఊసే లేదు కానీ, అన్నీ అమలు చేశానని చంద్రబాబు గొప్పలకు పోతున్నారని, ఆయనకు అల్జీమర్స్ పీక్స్‌కు వెళ్లిందనేందుకు ఇదే నిదర్శమన్నారు. ఈ పరిస్థితులను చూస్తుంటే ఆయన కుర్చీని లోకేష్‌బాబు లాక్కొనే టైం వచ్చిందనే అనుమానం కలుగుతోందన్నారు.

వ్యవస్థలన్నీ నాశనం..

చంద్రబాబు ఏడాది పాలనలో రాష్ట్రంలో మెడికల్ కళాశాలల అమ్మకాలు, వెనుకబడిన ప్రాంతాల తాగు, సాగునీటి ప్రాజెక్టులు.. వలంటీర్ల వ్యవస్థ, ఉన్న ఉద్యోగాల రద్దు, సచివాయాలు, ఆర్బీకేలు, మహిళా సాధికారత, విద్యార్థుల భవిష్యత్తును చిదిమేశారన్నారు. నిరుద్యోగులను మోసం చేశారన్నారు. మొత్తం వ్యవస్థలన్నీ నాశనమయ్యాయన్నారు. రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందన్నారు. పథకాల కోసం గొంతెత్తితే గొంతుకోస్తారనే భయాన్ని సృష్టించారన్నారు. రాష్ట్రానికి తనకు తాను బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకునే చంద్రబాబు వాస్తవానికి కరువుకు, అపద్ధాలకు, దగాకోరు పాలనకు, వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అనే విషయాన్ని విస్మరించారన్నారు. అభివృద్ధి పేరుతో ఇబ్బడిముబ్బడిగా నిధులు కేటాయించి, వాటిని పక్కదారి పట్టించడంపై ఉన్న తపన నీళ్లు పారించే విషయంగా చంద్రబాబుకు లేదన్నారు. అందుకే రాయలసీమకు కాని, గ్రేటర్ రాయలసీమకు గాని తాగు, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదన్నారు. గండికోట నుంచి గాలేరు-నగరి ద్వారా చిత్తూరు జిల్లాకు 20 టీఎంసీల నీళ్లు తీసుకెళ్లేందుకు జగన్‌మోహన్‌రెడ్డి పథకం తీసుకొచ్చి సగానికి పైగా పనులు చేస్తే చివరకు ఆ ప్రాజెక్టును చంద్రబాబు రద్దు చేశారన్నారు. హంద్రీనీవా మొదటిదశను 6,300 క్యూసెక్కులకు వెడల్పు చేసి 23 టీఎంసీల నీటిని అదనంగా తీసుకొచ్చే పనులను ప్రారంభిస్తే ఆ ప్రాజెక్టునూ రద్దు చేశారన్నారు. నారా వారి పాలనపై రాయలసీమ ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. సమావేశంలో అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, నాయకులు పొగాకు రామచంద్ర, కదిరి ఇస్మాయిల్, రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజి, గంగుల సుధీర్ రెడ్డి, బండిపవన్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

యోగా జీవితంలో భాగం కావాలి

- ప్రతి ఒక్కరూ యోగా చేసేలా చైతన్యం తీసుకురావాలి
- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం


సీఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: నిత్య జీవితంలో ఒత్తిడిని ఎదుర్కోవడంతో పాటు వివిధ రోగాల బారిన పడకుండా కాపాడే యోగాను ప్రతి ఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. 'యోగాంధ్ర' వేడుకలు ముగిసిన తర్వాత కూడా సమాజంలోని ప్రతి ఒక్కరూ యోగాను కొనసాగించేలా వారిలో చైతన్యం తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణపై శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్ కలెక్టరేట్‌లో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూన్ 21న జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని లేపాక్షిలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో యోగాంధ్ర పోటీలు నిర్వహించాలన్నారు. 'ప్రధాన మంత్రి సూర్యఘర్' పథకం కింద సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకుంటే విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఇందుకోసం నియోజకవర్గస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో పాటు అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రెండోరోజూ ఎస్‌ఏ ఇంగ్లిష్ టీచర్ల ధర్నా


ధర్నాలో పాల్గొన్న బాధిత టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ టీచర్ల ఖాళీలు పెంచాలని డిమాండ్ చేస్తూ రెండోరోజూ శుక్రవారం అనంతపురంలోని శారదా నగరపాలక ఉన్నత పాఠశాలలో ధర్నా కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇంగ్లిష్ పదోన్నతుల అంశంపై హైకోర్టులో వేసిన కేసు పరిష్కారమైందన్నారు. 2023, జనవరి 26 నుంచి ఏప్రిల్ 30 వరకు రూ. 2,500 గౌరవ వేతనంతో తాత్కాలిక పద్ధతిలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ టీచర్లుగా పనిచేసిన ఎస్జీటీలకు ఇంగ్లిష్ టీచర్లుగా పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొత్తం 230 ఖాళీలకు గాను కేవలం 19 మాత్రమే ఉన్నాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారని, వీటిని 2023లో తాత్కాలిక పద్ధతిలో ఇచ్చిన 230 స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పదోన్నతుల ఖాళీలుగానే చూపాలని డిమాండ్ చేశారు. డీఎస్సీకి 30 శాతం కోటా 103 పోస్టులు కేటాయించి ఇందులో 70 శాతం ఇవ్వాల్సిన పదోన్నతులను కాదని కేవలం 19 మాత్రమే ఇస్తామనడం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి సూర్యుడు, చంద్రశేఖర్, నాగభూషణ, జయరాం నాయక్, జయపాల్ నాయుడు, సురేష్, నరసింహులు, మురళి, భాస్కర నాయుడు, రవి, విజయ శ్రీ, పరిమళ, తులసి, మాధవి,ఆదిలక్ష్మి, కౌసర్ బాను పాల్గొన్నారు. ధర్నాకు ఎస్టీయూ రమణారెడ్డి, రామాంజనేయులు, యూటీఎఫ్ నాగేంద్ర, పీఆర్టీయూ విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌టీఏ నాగిరెడ్డి, శ్రీనివాసులు, రవినాయక్, నాగభూషణ, ఆర్‌ఈఎఫ్ నారాయణ నాయక్ మద్దతు తెలిపారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య


రంగ (ఫైల్)

తాడిపత్రి రూరల్: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రి మండలం చిన్నపొలమడ గ్రామానికి చెందిన చాకలి రంగ (45)కు భార్య సులోచన, ఇద్దరు కుమారులు ఉన్నారు. చేనేత మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాఆపరుల వద్ద చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.3 లక్షలకు చేరుకుంది. అప్పులు తీర్చాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెందిన రంగ... శుక్రవారం కోమలి - జూటూరు గ్రామాల మధ్య ఉన్న పట్టాలపైకి చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రేపు జూనియర్ మహిళల జిల్లా హాకీ జట్టు ఎంపిక

ధర్మవరం రూరల్: భీమవరం వేదికగా జూన్ 6 నుంచి 8వ తేదీ వరకూ జరిగే 15వ రాష్ట్ర స్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్టును ఆదివారం ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు ఏపీ హాకీ వైస్ ప్రెసిడెంట్ బి.సూర్యప్రకాష్ శుక్రవారం వెల్లడించారు. ఆదివారం ఉదయం 9గంటలకు ధర్మవరంలోని కళాశాల మైదానంలో ఎంపిక ఉంటుంది. 2006, జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకురావాలి. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని కాకినాడ వేదికగా ఆగస్టు 1 నుంచి 11వ తేదీ వరకూ జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు ఎంపిక చేస్తారు.

రైల్లో నగలు చోరీ చేస్తూ పట్టుబడిన దొంగ


నిందితుడిని విచారణ చేస్తున్న పోలీసులు

గుత్తి: రైలులో నగదు, నగలు చోరీ చేస్తూ ఓ దొంగ పట్టుపడ్డాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన మేరకు... శుక్రవారం మచిలీపట్నం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలులోని కోచ్-1లో ప్రయాణిస్తున్న ఓ యువకుడు ఓ ప్రయాణకుడి బ్యాగ్‌లోని బంగారు నగలు, నగదు, సెల్‌ఫోన్లు అపహరిస్తుండగా గమనించి మరో ప్రయాణికుడు వెంటనే పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాడు. రైలు గుత్తి రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, సివిల్ కానిస్టుబుల్ భాస్కర్ నాయుడు కోచ్-1లోకి చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఒకటిన్నర తులం బంగారు ఆభరణాలు, రూ.10 వేలు నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన యువకుడు నంద్యాల జిల్లాకు చెందిన జయరాజ్‌గా గుర్తించి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని సమగ్ర విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బంగారు నగల అపహరణ

ధర్మవరం రూరల్: స్థానిక గీతా నగర్‌లో నివాసముంటున్న పోలేపల్లి కోన శేఖర్‌గుప్త ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.2.80 లక్షల నగదు, 5.8 తులాల బంగారు నగలను అపహరించారు. శుక్రవారం ఉదయం చోరీ విషయాన్ని గుర్తించిన బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

రొళ్లలో చైన్ స్నాచింగ్


బాధితురాలు అనిత

రొళ్ల: మహిళ దృష్టిని ఏమార్చి ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించుకెళ్లిన ఘటన రొళ్లలో సంచలనం రేకెత్తించింది. వివరాలు.. రొళ్లలోని మధూడి గ్రామానికి వెళ్లే మార్గంలో 544ఈ జాతీయ రహదారి పక్కనే బసవరాజు కుటుంబ సభ్యులు నివాసముంటున్నారు. ఇంటి వద్దనే ఓ చిల్లరకొట్టు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి 9.45 గంటలకు పాలు తీసుకొచ్చేందుకు బసవరాజు బయటకు వెళ్లడంతో అతని భార్య అనిత దుకాణంలో వ్యాపారం కొనసాగిస్తోంది. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ యువకుడు సిగరెట్ కావాలని అడగడంతో అనిత తీసిచ్చి వెనుదిరిగే సమయంలో ఆమె మెడలోని 35 గ్రాముల బరువున్న బంగారం మాంగల్యం చైన్‌ను లాగాడు. అప్రమత్తమైన ఆమె చైన్‌ను పట్టుకోవడంతో పది గ్రాముల వరకు చైన్ తెగి చేతిలో ఉండిపోయింది. మిగిలిన 25 గ్రాముల చైన్‌తో యువకుడు బైక్‌పై ఉడాయించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆరా తీశారు. ఆవినకుంట సమీపంలో సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీ వద్ద అమర్చిన సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కనుకూరులో తల్లీబిడ్డ అదృశ్యం

శెట్టూరు: మండలంలోని కనుకూరు గ్రామానికి చెందిన వివాహిత, తన బిడ్డతో సహ కనిపించకుండా పోయింది. పోలీసులు తెలిపిన మేరకు.. కనుకూరుకు చెందిన బోయ మోహన్‌బాబు, హంసలత దంపతులకు నాలుగేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. గురువారం కూలీ పనులకు వెళ్లిన కుటుంబసభ్యులు సాయంత్రం ఇంటికి చేరుకునే సమయానికి హంసలతతో పాటు చిన్నారి కనిపించలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మోహన్‌బాబు ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు.

సీబీఎస్‌ఈ అభ్యర్థులపై 'తెలుగు' పిడుగు

- డీఎస్సీలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నష్టపోనున్న 3 వేల మంది అభ్యర్థులు



పుట్టపర్తి: డీఎస్సీలో సీబీఎస్‌ఈ అభ్యర్థులకు ప్రభుత్వం మొండిచేయి చూపింది. పదో తరగతిలో లాంగ్వేజ్-1లో తెలుగు చదివి ఉండాలనే నిబంధనతో సీబీఎస్‌ఈ అభ్యర్థుల నెత్తిన పిడుగు వేసింది.

రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోనున్న 20 వేల మంది..

ఉపాధ్యాయ నియామకాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయటంతో పాటు డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15తో తుది గడువుగా పేర్కొంది. దీంతో ఇబ్బడి ముబ్బడిగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మంది అభ్యర్థులు సీబీఎస్‌ఈ విధానంలో చదువుకున్నవారున్నారు. వీరంతా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థలు, ప్రైవేట్ డీఎడ్ కళాశాలల్లో టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసినవారే. అయితే డీఎస్సీ రాసే అభ్యర్థులు పదో తరగతిలో లాంగ్వేజ్-1లో తెలుగు చదివి ఉండాలనే నిబంధనను కూటమి ప్రభుత్వం చేర్చింది. వాస్తవానికి సీబీఎస్‌ఈ పదో తరగతిలో లాంగ్వేజ్-2 కింద తెలుగు ఉంటుందని, ఇక ఇంటర్మీడియట్‌లో తెలుగు సబ్జెక్టే ఉండదనే విషయాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించింది. దీంతో సీబీఎస్‌ఈ విధానం కింద చదువుకున్న రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మంది అభ్యర్థులు అర్హత కోల్పోయారు. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన 3 వేల మంది అభ్యర్థులు ఉన్నారు. ఇదే విషయమై హెల్ప్‌లైన్ ద్వారా అధికారులను అభ్యర్థులు సంప్రదించారు. పదో తరగతిలో లాంగ్వేజ్-1లో తప్పనిసరిగా తెలుగు సబ్జెక్టు ఉండాలని తెలపడంతో దరఖాస్తులో 'తెలుగు' అని పేర్కొన్నారు. దీంతో దరఖాస్తును ఇప్పటికి ఆమోదించినప్పటికీ పోస్టుల భర్తీ సమయంలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదముందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

న్యాయం చేయాలి



ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నాం. డీఎస్సీ కోసమని ఇప్పటికే చాలా డబ్బు ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకున్నా. ఇప్పుడు తెలుగు నిబంధనతో ఇబ్బంది పెట్టడం సరికాదు. మాకు న్యాయం జరిగేలా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలి.

– అనిల్, గంగవరం, అనంతపురం జిల్లా

స్పష్టత ఇవ్వాలి



టెన్త్ సీబీఎస్‌ఈ సిలబస్‌లో తెలుగు సబ్జెక్టు లాంగ్వేజ్-2గా ఉంటుంది. అధికారులు మాత్రం డీఎస్సీ దరఖాస్తులో లాంగ్వేజ్-1లో తెలుగు ఉండాలంటున్నారు. అలాంటప్పుడు సీబీఎస్‌ఈ చదివిన మేమంతా అర్హత కోల్పోవాల్సి వస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టతనివ్వాలి. మాకు న్యాయం చేయాలి.

– గజేంద్రకుమార్, హిందూపురం, శ్రీసత్యసాయి జిల్లా